తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

telugupabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వెబ్రెంట్ ఎడిషన్ 4 pm

గురువారం 3-8-2023

మూడు రోజుల పాటు అసెంబ్లీ..

హైదరాబాద్, ఆగస్ట్3 (తెలుగుప్రభ)

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణతో పాటు పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం తరపున మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం తరపున అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. ఈ భేటీలో మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది.

ఈ సందర్భంగా ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహించాలని విపక్షాలు కోరాయి. అయితే పని దినాలు కాదు, పని గంటలపై చూడాలని మంత్రి హరీశ్ రావు అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రభుత్వ చర్యలపై చర్చించాలని నిర్ణయించారు. సమావేశాల్లో ప్రభుత్వం దాదాపు పది బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. శుక్రవారం వరదలు, శనివారం పలు బిల్లులపై చర్చించనున్నారు.

రైతుల సంబురాలు

సర్కారు ప్రకటనపై హర్షాతిరేకాలు

హైదరాబాద్, ఆగస్ట్3 (తెలుగుప్రభ)

బీఆర్ఎస్ సర్కారు రుణమాఫీ ప్రకటనపై రాష్ట్ర వ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంబరాలు చేసుకుంటున్నారు. రూ.19 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తున్నారు. వరి చేళల్లో కేసీఆర్ అక్షరాలు రాస్తూ ముఖ్యమంత్రికి తమ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేటలోని దూది వెంకటాపురంలో నారుతో కేసీఆర్ అక్షరాలు పేర్చి రైతులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రైతులు సంబరాలు జరుపుకుంటున్నారు. రైతు రుణమాఫీ ప్రకటించినందుకుగాను బోథ్ మండలం సోనాలలో రైతులు తమ పంట పొలాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోని జేపీ తండా, గట్ల మాల్యాల, సిద్దన్నపేట గ్రామాల ప్రజలు, రైతులు.. రుణమాఫీ చేసి మరోసారి రైతు బాంధవుడు అని నిదర్శనం అని చూపిన కేసీఆర్, మంత్రి హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సిరిసిల్ల జిల్లా పెద్దూరులోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట రైతులు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జై కేసీఆర్, జై బీఆర్ఎస్ నినాదాలతో హోరెత్తించారు.

బీజేపీకి లాభమెంత?

'రాణి'స్తారా రాజకీయాన?

తారంగంతో గెలుస్తుందా రాజకీయం
జయసుధ చేరికతో బీజేపీకి లాభమెంత ?
మెరిసే తారల వెలుగులెంత వరకు ?

హైదరాబాద్, ఆగస్ట్3(తెలుగుప్రభ):

జయసుధ కాషాయం కండువా కప్పుకున్నారు. గతంలోనూ రాజకీయంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన జయసుధ ఎందుకనోగానీ సినీరంగంలో రాణించినంతగా రాజకీయాల్లో రాణించలేకపోయారు. సినీతారగా తొలిరోజుల్లో చిరుపాత్రలతో మొదలుపెట్టి హీరోయిన్ నుంచి తల్లిపాత్రల క్యారెక్టర్ ఆర్టిస్టుదాకా ఎందులోనైనా అవలీలగా ఒదిగిపోయిన ఆమె నిజంగానే సహజనటి. రాజకీయాల్లో నటీనటులకు కొదవ లేదు కానీ వెండితెరపై వెలిగిన ఆమె రాజకీయాల్లో మాత్రం నటించలేక పోయారు. అదే పెద్ద విచిత్రం. రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే గట్టిపట్టుదలతో ఉన్న భారతీయజనతాపార్టీ ఆమెకు వల వేసింది. తమ పార్టీలో చేర్చుకుంది కానీ నటనలో ఒదిగిపోయిన జయసుధకు రాజకీయాలు రావనే చెప్పాలి. ఎందుకంటే గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పిలుపుతో కాంగ్రెస్ పార్టీ నుంచి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్లపాటు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, ఆతర్వాత రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. రాజకీయాలు ఒంటబట్టకపోవడం వల్లే వాటి గురించి పట్టించుకోలేదు. కానీ.. సినీరంగంలోనూ రాజకీయాలుంటాయని వేదన చెందిన ఆమె.. సినీరంగంలో యాభయ్యేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న తనను కనీసం గుర్తించలేదని వాపోయారు. నిజంగా రాజకీయాల్లో గుర్తింపు ఉంటుందని ఆమె భావిస్తున్నారేమో కానీ తన కంటే ఒక తరం జూనియర్ అయిన విజయశాంతికి సైతం రాజకీయంగా లాభించిందేమీ లేదనేచెప్పాలి. రాములమ్మగా తెరపై వెలిగినంతగా రాజకీయాల్లో వెలగలేదనే చెప్పాలి. రాజకీయంగా తొలుత బీజేపీలోనే చేరి మహిళా విభాగం సెక్రటరీగా కూడా పనిచేసిన ఆమె అనంతరం 'తల్లి తెలంగాణ' పార్టీ స్థాపించి, అప్పటి టీఆర్ఎస్‌తోకలిసి.. మెదక్ నుంచి ఎంపీగా గెలిచి, తెలంగాణ కోసం ఎంపీ పదవికి రాజీనామా కూడా చేయడం తెలిసిందే. కేసీఆర్‌తో తలెత్తిన విభేదాలతో టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం.. అక్కడా ఇమడలేక తిరిగి మళ్లీ బీజేపీలో చేరారు. లేడీ అమితాబ్‌గా పేరుపొందిన ఆమె రాజకీయాల్లో తనకు తగిన ప్రాధాన్యత నివ్వడం లేరని తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీలో పలు సందర్భాల్లో ఇది వెల్లడైంది. ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్‌ను తప్పించిన సందర్భంలోనూ ఆమె పార్టీతీరును ఆక్షేపించారు. వీరితో పోలిస్తే ఏపీలో మంత్రిగా కొనసాగుతున్న రోజాకు తెలిసినంతగా రాజకీయాలు వీరిద్దరికీ తెలియవనే చెప్పాలి. ఎంతటి వారితోనైనా సై అంటే సైసై అనే రోజా కంటే వీరు నటనలో ఎక్కువేమో కానీ, రాజకీయంలో మాత్రం తక్కువే. సినీతారలుగా ఉన్న గ్లామర్‌తో రాజకీయాల్లో గెలవాలనుకోవడం అన్ని సందర్భాల్లో సాధ్యం కాదని గతంలో పలు సందర్భాల్లో వెల్లడైంది. వెండితెరపై తిరుగులేని హేమాహేమీలుగా రాణించిన వారు సైతం రాజకీయ చదరంగంలో ఓడిపోయిన సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో సినీగ్లామర్‌తో బీజేపీ గెలవాలనుకోవడం ఎంతవరకు ఆపార్టీకి లాభిస్తుందో ఎన్నికల్లోనే వెల్లడి కానుంది. విజయశాంతి బహుశా మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయవచ్చన నే అంచనాలున్నాయి. ఇక జయసుధ గతంలో ఎన్నికైన సికింద్రాబాద్ నుంచి కానీ పక్కనే ఉన్న ముషీరాబాద్ నుంచి కానీ పోటీ చేయవచ్చునని భావిస్తున్నారు. గతంలో జయసుధ గెలిచిందంటే దాని వెనుక వైఎస్ వ్యూహం ఉంది. అప్పట్లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ సైతం పరోక్షంగా ఆమెకు సహకరించారనే గుసగుసలు కూడా వినిపించాయి.అనంతరం ఆయన తన నియోజకవర్గాన్ని సికింద్రాబాద్ నుంచి సనత్‌నగర్‌కు షిఫ్ట్ చేసుకున్నారు.జయసుధ ఎక్కడినుంచి పోటీచేసినప్పటికి పరిస్థితులు గతంలోలా లేవు. ఐదేళ్లు చేసిన రాజకీయంతో ఆమె స్థానికంగా సంపాదించుకున్న అనుచరగణం కూడా లేదు. ఈనేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో ఆమె గెలవడమే కష్టం.. అలాంటిది తారగా మెరుపుతో ఆమె వల్ల బీజేపీ ఏమేరకు లాభపడనుందో ఆపార్టీ పెద్దలకే తెలియాలి.



1.14 కోట్లు

ఓ టీవీ ధర ఇది..!

న్యూఢిల్లీ, ఆగస్ట్3 (తెలుగుప్రభ)

కొత్తగా వచ్చిన ఓ టీవీ ధర ఎంతో ఊహించగలరా..? ఎంతుంటుంది.. మహా అయితే లక్షో.. రెండు లక్షలో ఉంటుంది.. అనుకుంటున్నారా..? కానీ.. ఈ టీవీ ధర ఎంతో తెలుసా... 1.14 కోట్లు. అవును మీరు చదివింది నిజమే. అక్షరాలా కోటీ 14 లక్షలు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో స్మార్ట్ టీవీలు అందుబాటులో ఉన్నాయి. అందరూ 32 అంగుళాల నుంచి 43, 55 అంగుళాల వరకూ వారి వారి బడ్జెట్ ను బట్టి కొనుగోలు చేస్తారు. దీని కోసం సాధారణంగా ఖర్చు చేసే మొత్తం రూ. 20 వేల నుంచి రూ. 50,000 మరికొంత మంది రూ. లక్ష వరకూ ఖర్చుపెడతారు. శామ్‌సంగ్ కొత్త లాంచ్ చేసిన 110 అంగుళాల మైక్రో ఎల్ఈడీ స్మార్ట్ టీవీ ధర మాత్రం అక్షరాల రూ.1,14,99,000. పూర్తి అల్ట్రా ప్రీమియం డిజైన్ తో గ్లోబల్ టెక్ శామ్సంగ్ ఈ టీవీని భారతీయ మార్కెట్లోకి లాంచ్ చేసింది. దీనిలోని ఫీచర్లు, తదుపరి-స్థాయి సాంకేతికతతో టెలివిజన్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చేందుకు ఇది నాంది పలుకుతుందని శామ్సంగ్ ప్రకటించింది. ఈ మైక్రో ఎల్ఈడీ టెలివిజన్ ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లు, శామ్సంగ్ అధికారిక వెబ్ సైట్లో అందుబాటులో ఉంది. రూ. కోటి కన్నా అధిక ధరతో మన దేశంలో లాంచ్ అయిన మొట్టమొదటి టీవీ ఇదే కావడం విశేషం.

ప్రత్యేకత ఇదీ..

సొగసైన డిజైన్‌తో వస్తున్న ఈ మైక్రో ఎల్ఈడీ టెలివిజన్ అల్ట్రా-ప్రీమియం వీక్షణ అనుభవాన్ని కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంది. ఇది 24.8 మిలియన్ మైక్రోమీటర్-పరిమాణ అల్ట్రా-స్మాల్ ఎల్ఈడీలను అందిస్తుంది. ఇవి సంప్రదాయ పెద్ద-పరిమాణ ఎల్ఈడీల కంటే 1/10వ వంతు పరిమాణంలో ఉంటాయి. ఇది నీలమణి మెటీరియల్ నుండి రూపొందించబడింది. ఇది భూమిపై రెండవ అత్యంత కఠినమైన పదార్థం. మైక్రో ఎల్ఈడీ శక్తివంతమైన రంగులతో, అధిక స్థాయి స్పష్టత, కాంట్రాస్ట్‌తో లీనమయ్యే వీక్షణ అనుభవాన్ని అందిస్తుంది.

ఏ వైపు నుంచి చూసినా..

120 ఎఫ్పీఎస్ వరకు సహజమైన 4కే రిజల్యూషన్‌లో గరిష్టంగా నాలుగు విభిన్న మూలాల నుంచి కంటెంట్ ను వీక్షించడానికి అనుమతించే మల్టీ వ్యూ ఫీచర్ కూడా ఉంది. ఇది లైవ్ స్పోర్ట్స్ చూసినా, టీవీ షోలు చేసినా లేదా వీడియో గేమ్‌లు ఆడినా మొత్తం లీనమయ్యే అనుభవాన్ని జోడిస్తుంది.

ఫొటోలు దిగండి..

టమోటాలు తీసుకెళ్లండి..

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్3 (తెలుగుప్రభ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో ఓ ఫొటో స్టూడియో యజమాని వెరైటీ ఆఫర్ ప్రకటించాడు. తన స్టూడియోలో ఫొటోలు దిగి.. ఎనిమిది ఫొటోలు తీసుకుంటే టమోటాలు ఉచితంగా ఇస్తున్నాడు.. ఫొటోలు దిగండి.. టమోటాలు తీసుకెళ్లండి.. ఫొటోగ్రాఫర్.. బంపర్ ఆఫర్.. అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు స్థానికులను ఆకట్టుకుని... అక్కడికి వచ్చి ఫొటోలు దిగేలా చేస్తున్నాయి. ప్రస్తుతం సామాన్యులకు అందుబాటులో లేని ధర ఉన్న ఈ సమయంలో టమోటాలను ఆఫర్‌గా పెట్టారు ఈ ఫొటోగ్రాఫర్. నేడు మార్కెట్లో టమోటా ధర భగ్గుమంటోంది. డబుల్ సెంచరీ దాటి పరుగులు తీస్తోంది. ఈ క్రమంలో టమోటా కొనుగోలు చేయాలంటేనే సామాన్య ప్రజలు భయపడుతున్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దిగండి.. టమోటాలు పట్టుకెళ్లండి అంటూ బంపర్ ఆఫర్ ప్రకటించాడు కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ కాంప్లెక్సులో ఆనంద్ అనే ఫొటో స్టూడియో యజమాని. వంద రూపాయలు ఇచ్చి ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో దిగి.. 8 కాపీలు తీసుకుంటే 50 రూపాయల విలువగల టమోటాల ప్యాకెట్‌ను కానుకగా అందిస్తున్నాడు.

తెలంగాణలో కొత్త మద్యం పాలసీ

హైదరాబాద్, ఆగస్ట్3 (తెలుగుప్రభ)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. గతంలో మాదిరిగానే 2011 జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజుల్ని ఖరారు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 2025 నవంబరు 30 వరకు రెండేళ్ల పాటు ఈ విధానం అమలులో ఉండనుంది. వాస్తవానికి క్రితంసారి మద్యం విధానానికి సంబంధించి మద్యం దుకాణదారుల ఎంపికకు 2021 నవంబరులో టెండర్లు నిర్వహించారు. వాటి గడువు ఈ ఏడాది నవంబరు 30 వరకూ ఉంది. ఇప్పుడు మాత్రం ఆగస్టులోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించడం గమనార్హం. వచ్చే నవంబరు లేదా డిసెంబరులో శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశముండటంతోనే ముందస్తుగా టెండర్లు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ నెల 4 నుంచి 21వ తేదీలోగా దుకాణదారుల్ని ఎంపిక చేయనున్నారు. టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి మద్యం విక్రయాలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఈసారి మద్యం దుకాణాల లైసెన్స్ రుసుము గతంలో మాదిరిగానే ప్రభుత్వం ఆరు స్లాబులుగా ఖరారు చేసింది. నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుంను 2 లక్షల రూపాయలుగా నిర్ణయించింది. ఒక దరఖాస్తుదారుడు ఎన్నైనా దరఖాస్తులు దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ప్రతి దరఖాస్తుకు విధిగా2 లక్షల రూపాయల చొప్పున చెల్లించాలి. రాష్ట్రవ్యాప్తంగా 2,620 దుకాణాలకు లాటరీ పద్ధతిలో దుకాణదారుల్ని ఎంపిక చేయనున్నారు. దరఖాస్తుల రుసుం కింద ఈసారి 1500-1800 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుందని అంచనా. రిజర్వేషన్ కేటగిరీలో భాగంగా 786 మద్యం దుకాణాల్లో గౌడ సామాజికవర్గానికి 393 , ఎస్సీలకు 262 ఎస్టీలకు 131షాపులు కేటాయించారు. వ్యాపారులకు ఆర్డినరీ మద్యం విక్రయాలపై 27 శాతం.. మీడియం, ప్రీమియం మద్యంపై 20 శాతం.. బీర్లపై 20 శాతం మార్జిన్ నిర్ణయించారు. మద్యం దుకాణాదారులు ఆరు విడతల్లో లైసెన్స్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.వార్షిక లైసెన్స్ రుసుంలో 25 శాతం మొత్తానికి 25 నెలల పాటు బ్యాంకు పూచీకత్తు ఇవ్వాలి. గతంలో మాదిరిగానే రాష్ట్రమంతటా దుకాణాలను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరవాలి. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం రాత్రి 11 గంటల వరకు అమ్మకాలు సాగించే వెసులుబాటు కల్పించారు.

ఆమె హత్యకు ఇదే కారణం

జీడిమెట్ల, ఆగస్ట్3 (తెలుగుప్రభ)



జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బంధం చెరువు కట్టపై మహిళ మృతదేహం కేసులో చిక్కుముడి వీడింది. పోలీసులు కథనం ప్రకారం.. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. భర్తను హత్య చేసిన కేసులో బెయిల్ పై నుండి వచ్చిన అనంతరం భార్యను అత్యంత దారుణంగా హత్య చేశారు. కట్టమైసమ్మ ఆలయం సమీపంలోని బంధం చెరువు కట్టపై మహిళా మృతదేహాన్ని గుర్తించారు అక్కడి స్థానికులు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా మృతురాలు రేణుక అలియాస్ ధరణిగా గుర్తించారు. సూరారం విశ్వకర్మ కాలనీకి చెందిన సురేష్ తో రేణుకకు ఏడేళ్ల క్రితం వివాహం అయింది. వీరిద్దరికీ ఇద్దరు కూతుర్లు కూడా ఉన్నారు. అనంతరం కుటుంబ కలహాలతో భర్త సురేష్ తో విడిపోయి ఉంటున్న రేణుక దుండిగల్ లోని ఓ ప్రైవేటు పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న సాయిబాబాతో సహజీవనం చేస్తుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త సురేష్ భార్య రేణుకను మందలించాడు. దీంతో ఎలా అయినా సురేష్ అడ్డు తొలగించుకోవాలని భావించిన రేణుక.. ఫిబ్రవరి 6న మరో మహిళతో కలిసి భర్త సురేష్ ను దారుణంగా హత్య చేసింది. ఆ కేసులో జైలుకెళ్ళిన రేణుక ఇటీవల బెయిల్ పై తిరిగి వచ్చింది. తాజాగా పోలీస్ స్టేషన్లో సంతకం పెట్టి ఇంటికి వెళ్లిన రేణుక పని మీది తిరిగి బయటికి రాగా రేణుకను బంధం చెరువు కట్టపై హత్య చేశారు. మృతురాలు రేణుకా మృతదేహం పై ఉన్నటువంటి గాయాలను చూసి హత్యగా తేల్చారు పోలీసులు. దీంతో ఆమె మొబైల్ ఫోన్ ను పరిశీలించగా చివరి ఫోన్ కాల్ రేణుక భర్త సురేష్ తమ్ముడు నరేష్ తో మాట్లాడినట్లుగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీ కి తరలించారు పోలీసులు.

ఆరు నెలల్లో అధికారంలోకి టీడీపీ

అమరావతి, ఆగస్ట్3 (తెలుగుప్రభ)

ఆరు నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు కబ్జా దారుల ఆట కట్టిస్తామని ఆపార్టీ ఏపీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో కంటికి రెప్పలా కాపాడిన ప్రభుత్వ స్థలాలు కబ్జాగురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే కబ్జాదారులు ఆటకట్టిస్తామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. టెక్కలిలో ప్రభుత్వ స్థలాలను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటుంటే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.